


విద్యుత్ ఎస్ఇగా బాధ్యతలు స్వీకరించిన రమణ



బాధ్యతలు స్వీకరిస్తున్న రమణ

ప్రజాశక్తి-రాయచోటి/చిన్నమండెం

అన్నమయ్య జిల్లా ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇగా ఎస్.రమణ సోమవారం రాయచోటి సర్కిల్ ఆఫీసులో బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య సర్కిల్ పర్యవేక్షణాధికారిగా పనిచేస్తున్న ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మెడికల్ సెలవుపైన వెళ్లడంతో రమణ కడప సర్కిల్ పర్యవేక్షణ అధికారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎస్ఇని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఇంజినీర్లు, ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు కలిశారు. అనంతరం చిన్నమండెం మండలంలోని కేశపురం గ్రామంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. రైతులకు ఎటువంటి సమస్య లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు చేపట్టాలని ఆయనకు సూచించారు. విద్యుత్ సమస్యలు ఏమైనా ఉన్నట్లయితే వెంటనే తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని మంత్రి తెలిపారు.

ప్రజా సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలి

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రామాపురం

అధికారులు ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రవాణా, యువజన, క్రీడ శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం మంత్రి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా లేనివిధంగా అన్నమయ్య జిల్లాలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, రెవెన్యూ అధికారులు భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని సూచించారు. మన జిల్లాలో మంచి అనుభవం గల అధికారులు పనిచేస్తున్నారని, వీఆర్ఒ నుంచి ఆర్‌డిఒ వరకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో భూ సమస్యలు పరిష్కరించినట్లయితే పేదలకు న్యాయం చేయవచ్చునన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత ప్రభుత్వంలో జరిగిన భూ ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించి పేదలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారని చెప్పారు. అధికారులందరూ ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని భూ సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా భూ సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ప్రతి మండలంలో నెలకు ఒకసారి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈనెల 12న కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలల కాలం పూర్తవుతుందని ఈ ఆరు నెలల కాలంలో చాలావరకు భూ సమస్యలు పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వంలో అర్జీదారులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకునేవారని, అలా కాకుండా అధికారులు బాధితుల సమస్యలు ఏ టైం లోపల పరిష్కరిస్తామో వారికి కచ్చితమైన ఎండార్స్‌మెంట్ ఇచ్చి సమస్య పరిష్కరించాలన్నారు. అప్పుడే ప్రజలకు తమపై నమ్మకం కలుగుతుందన్నారు. అధికారులు బాధితులను చీదరించుకోకుండా వారిని సోదర భావంతో పలకరించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని శాఖల కంటే రెవెన్యూ శాఖకు అధిక ప్రాధాన్యత ఉందని ఏ పని చేయాలన్నా రెవెన్యూ శాఖపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. రెవెన్యూశాఖలో వీఆర్ఒ నుంచి ఆర్‌డిఒ వరకు బాగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలలకాలంలోనే రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తూ అవసరమైన వారికి ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు ఇస్తున్నారని చెప్పారు. వచ్చే జనవరిలో రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులందరికీ కొత్త ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. రాయచోటి నియోజకవర్గంలో వర్షాభావ పరిస్థితుల వల్ల నీటి సమస్య ఏర్పడే అవకాశం ఉందని, ఇప్పటినుంచే ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు గ్రామాలకు వెళ్లి నీటి సమస్యను గుర్తించి అక్కడ ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఎంతో మంది పేదలు లబ్ధి పొందుతున్నారని ఈ పథకంలో ఎలాంటి అవినీతి జరిగినా సహించేది లేదని హెచ్చరించారు. కొంతమంది నకిలీ జాబ్ కార్డులు సృష్టించి పేదలకు అన్యాయం చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారిని ఎట్టి పరిస్థితులలో సహించేది లేదని హెచ్చరించారు. గ్రామాలలో అర్హులైన పేదలందరికీ జాబ్ కార్డులు మంజూరు చేసి ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఉద్యోగస్తులకు ప్రతినెల క్రమం తప్పకుండా 1వ తేదీనే జీతాలు ఇస్తున్నామన్నారు. ఇది ఫ్రెండ్లీ ప్రభుత్వమని అధికారులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయమన్నారు. రాయచోటి నియోజకవర్గంలో అధికారులకు ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవచ్చునన్నారు. ఇకనుంచి ప్రతి మండలంలో నెలకు ఒకసారి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడం జరుగుతుందన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీనివాస్, తహశీల్దార్ రామాంజనేయులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నల్లగుట్టపల్లిలో నీటి సరఫరా

మండలంలోని నల్లగుట్టపల్లి బిసి కాలనీలో ఏర్పాటు చేసిన బోరుకు మోటర్ బిగించి గ్రామస్తులకు నీటిని సరఫరా చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రామాపురం మండలంలో నీటి సమస్య అధికంగా ఉందని నల్లగుట్టపల్లి బిసి కాలనీలో నూతన బోరు వేసి మోటార్ బిగించి, గ్రామానికి నీటి సరఫరా చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం

- **విసిగి వేసారిన మాజీ సైనికుడు**
- **తహశీల్దార్ ఎదుటే బ్లేడ్‌తో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నం**



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మాజీ సైనికుడు రామచంద్ర

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఏళ్ల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా, అధికారులను కాళ్లా వేళ్లా పడిన ఆ మాజీ సైనికుడికి న్యాయం జరగలేదు. పక్షవాతంతో అనారోగ్యం బారిన పడిన ఆ మాజీ సైనికుడు తన చావుతోనైనా మరొకరికి న్యాయం జరుగుతుందన్న ఆవేదనతో తహశీల్దార్ ఎదుటే గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన సోమవారం మదనపల్లె పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. మదనపల్లె పట్టణం, భువనేశ్వరి నగర్‌లో నివాసం ఉంటున్న ఆర్.రామచంద్ర 1983లో దేశ భద్రత కోసం సైన్యంలో చేరాడు. సుమారు 22 ఏళ్ల పాటు సైన్యంలో పనిచేసి 2005లో రిటైర్డ్ అయ్యారు. ప్రభుత్వం మాజీ సైనికులకు కొంత భూమిని కేటాయించడంలో భాగంగా రామచంద్రకు మదనపల్లి మండలం, వెంకప్పకోట గ్రామ పంచాయతీలో సర్వేనెంబర్ 89లో 2.30 ఎకరాల భూమిని కేటాయించి పట్టా, పాసు బుక్కులు ఇచ్చింది. ఆ భూమిలో కొన్నాళ్లపాటు సాగు చేసుకున్న రామచంద్ర బ్యాంకు రుణం కూడా తీసుకున్నాడు. 2020లో పక్షవాతం రావడంతో వైద్య చికిత్సలు చేయించుకుంటూ ఇంటిపట్టునే ఉన్నాడు. 2023 మార్చిలో భూమిని ఆన్‌లైన్ నుంచి తప్పించి, వన్ బి లేకుండా చేశారు. అనంతరం చదును చేసేందుకు భూమి వద్దకు వెళ్లిన మాజీ సైనికుడిని రెవెన్యూ అధికారులు అడ్డుకుని భూమి నీదికాదని వెనక్కి పంపించారు. ఆ మాజీ సైనికుడు అధికారుల చుట్టూ పలు దఫాలుగా తిరిగాడు. సిఎంఒ పేషీకి వెళ్ళి మొరపెట్టుకున్నాడు. మాజీ సైనికుడికి ఇచ్చిన భూమిని తిరిగి అతనికి అప్పగించాలని, స్కెచ్ ఇచ్చి, ఆన్‌లైనలో తిరిగి చేర్చాలని సిఎంఒ నుంచి అధికారులకు ఆదేశాలు వచ్చాయి. అప్పటి నుంచి సబ్ కలెక్టర్, తహ శీల్దార్‌ల చుట్టూ తిరుగుతున్నా ఇంత వరకు అధికారులు పట్టించుకున్న దాఖ లాలు లేవు. సోమవారం మదనపల్లె తహశీల్దార్ కార్యాల యానికి వెళ్లిన మాజీ సైనికుడు రామచంద్ర తహ శీల్దార్ ఖాజాబీని నిలదీశారు. తనకు పనిజరగందే ఇక్కడ నుంచి వెళ్లనని, చావనైనా చస్తానని తెగేసి చెప్పాడు. ఆమె పోలీసులకు సమాచారం అందించారు. ఒకటో పట్టణ ఎస్ఐ శివకుమార్ సిబ్బందితో తహశీల్దారు కార్యాలయానికి చేరుకోవడంతో తన పని చేయకపోగా పోలీసులను పిలిపిస్తారా అని వెంట తెచ్చుకున్న బ్లేడు, కత్తితో అందరిముందు గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే బాధితుడిని స్థానిక ప్రభుత్వా సుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందించారు. ఈ విషయమై ఎస్ఐ శివకుమార్‌ను వివరణ అడగా చాలా సున్నితమైన సమస్య అని, పైఅధికారులు దృష్టికి తీసుకున్న తర్వాత ఏం చేయాలన్నది నిర్ణయిస్తామన్నారు. అనంతరం తహశీల్దారు ఖాజాబీని వివరణ కోరగా 2023లో భూమి సర్వే చేసినప్పుడు భూమి ఎవరైతే చూపారో వారి భూమి వివరాల మాత్రమే ఆన్‌లైన్‌లో చేర్చారన్నారు. ఆ సమయంలో వీరు అందుబాటులో లేక భూమిని చూపకపోవడంతో వారి భూమిని బ్లాక్ లిస్టులో పెట్టారని తెలిపారు. మాజీ సైనికుడి పెట్టుకున్న అర్జీ ప్రకారం తిరిగి ఆ భూమిని ఇప్పించడానికి లేదా మరో ప్రత్యామ్నాయ మార్గం చూపడానికి ప్రయత్నాలు చేస్తున్నామని ఈలోపే ఆయన కార్యాలయానికి వచ్చి ఇలా చేశాడని తెలిపారు.

మాజీ సైనికుడిని పరామర్శించిన ఎమ్మెల్యే : తహశీల్దారు కార్యాలయంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మాజీ సైనికుడు రామచంద్రను ఆయన ఇంటికి ఎమ్మెల్యే షాజహాన్ బాష వెళ్లి పరామర్శించారు. తాను చనిపోతేనైనా నలుగురికి మంచి జరుగుతుందేమోనని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించినట్లు రామచంద్ర ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ఇకపై ఇలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. వెంటనే భూ సర్వే చేసి సమస్యను పరిష్కరించాలని మండల సర్వేయర్‌ను ఆదేశించారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ విజయంపై యుటిఎఫ్ సంబరాలు



కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి విజయం సాధించిన నేపథ్యంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక డిఇఒ కార్యాలయ ఆవరణలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జాబీర్ మాట్లాడుతూ గతంలో ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జి రోడ్డు ప్రమాదంలో చనిపోయిన కారణంగా ఈ నెల 5న నిర్వహించిన ఉప ఎన్నికల్లో సాబ్జి స్థానంలో ఉపాధ్యాయుల, అధ్యాపకుల హక్కుల కోసం, పాలకులను నిలదీసే, పోరాటాల పిడికిలి, ఉద్యమ వారసత్వమే ఊపిరిగా పిడిఎఫ్ అభ్యర్థిగా బొర్రాగోపిమూర్తి పోటీ చేసి 9165 మొదటి ప్రాధాన్యతా ఓట్లతోనే గెలవడం అభినందనీయం అన్నారు. పిడి.యఫ్ గెలుపు ప్రజాస్వామ్యానికి మలుపు అన్నారు. లాబియింగ్‌లు, ఊసరవెల్లి రాజకీయాల కుట్రలు తిప్పి కొట్టి ప్రజాస్వామ్యాన్ని గెలిపించిన ఓటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు హాపిజుల్లా, శ్రీధర్ రెడ్డి, సురేంద్రరెడ్డి, చంద్రశేఖర్, దావుద్దీన్, అమీనుల్లా, ఆదిల్, రాజబాబు, హాసనుల్లా, విశ్వనాథరెడ్డి వేణుగోపాల్, అల్తాఫ్, అజీర్, ఉమా శంకర్, రాజా రమేష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు, ఫయాజ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయాలి

- ఎపి ఖాదీ గ్రామీణ పరిశ్రమ బోర్డు చైర్మన్ కె.కె.చౌదరి



సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.చౌదరి

ప్రజాశక్తి-చిట్వేలి

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలందరికీ చేరయ్యేలా అధికారులు పనిచేయాలని ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు చైర్మన్ కె.కె.చౌదరి అన్నారు. స్థానిక ఎంపిపి సభాభావనంలో సోమవారం అధ్యక్షులు చంద్ర అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలుపరిస్తున్న సంక్షేమ ఫలాలు అందరికి అందించేందుకు అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని అధికారులకు కోరారు. అనంతరం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఎస్సీ సెల్ డైరెక్టర్ అనిత దీప్తి మాట్లాడుతూ ఎస్సీ సెల్ కార్పొరేషన్ ద్వారా ప్రజలకు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మోహన్, సిఐ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు సుబ్రమణ్యంరెడ్డి, రామాంజుల నాయుడు, నాగార్జుననాయుడు, బాలాజీ, వెంకటేశ్వరరాజు, గుండాలయ్య యాదవ్, కరిముల్లా ఎంపిటిసి నాగార్జున ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. తొలిసారి మండలానికి వచ్చిన కెకె.చౌదరికి చిట్వేల్‌లో ఘన స్వాగతం పలికారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్ నుంచి కొత్తబస్టాండ్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా కూటమి నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో చౌదరికి ఘనస్వాగతం పలికారు. స్థానిక కొత్త బస్టాండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అడుగడుగునా ఆయనకు ప్రజలు నీరాజనాలు పలికారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామానుజుల నాయుడు, యువ నాయకుడు నాగార్జున, లాయర్ బాలాజీ, గూడూరు నాగరాజు, గుండాలయ్య యాదవ్, పాపయ్య, వెంకటసుబ్బయ్య, కరిముల్లా కూటమి నాయకులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు చూపుతున్న ఎఎస్‌పి వెంకటాద్రి

నలుగురు అంతర్రాష్ట్ర దొంగలు అరెస్టు

- 37 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

- వివరాలు వెల్లడించిన ఎఎస్‌పి ఎం.వెంకటాద్రి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ద్విచక్రవాహన దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు అంతర్రాష్ట్ర దొంగలను వాయల్పాడు పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 37ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎఎస్‌పి ఎం. వెంకటాద్రి సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని పరేడ్ మైదానంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లాలో కొద్ది నెలలుగా ద్విచక్ర వాహనాల దొంగతనాలు ఎక్కువ కావడంతో, దొంగలను పట్టుకోవడానికి సవాల్‌గా స్వీకరించిన పోలీసులు ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు పక్కా సమాచారంతో వాయల్పాడు రైల్వేస్టేషన్ ఎదురుగా వాహనాలను తనిఖీ నిర్వహించారన్నారు. ఆ సమయంలో అటుగా రెండు ద్విచక్ర వాహనాల్లో నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా వెళ్ళుతుండగా వారిని పట్టుకొని విచారించామని అన్నారు. జల్సాలకు అలవాటు పడిన ముద్దాయిలు వాయల్పాడులో మూడు ద్విచక్ర వాహనాలతో పాటు చిత్తూరు, తిరుపతి జిల్లాలలోనేగాక కర్ణాటక రాష్ట్రంలో 7 ద్విచక్ర వాహనాలు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారని చెప్పారు. వారి వద్ద నుండి రూ. 65 లక్షలు విలువ చేసే 37 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ముద్దాయిలలో ముగ్గురు మైనర్లున్నారని వారు జల్సాలకు అలవాటు పడి బైక్ దొంగల అవతారం ఎత్తారన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై వారు చేసే పనులపై దృష్టి పెట్టి వారిని సక్రమమైన మార్గంలో నడిచే విధంగా చూడాలని అన్నారు. ద్విచక్ర వాహనాలను స్వాధీన పరచడంలో ప్రతిభ కనబరిచిన పోలీసులకు ఆయన అభినందించారు. కార్యక్రమంలో రాయచోటి డిఎస్‌పి ఎం.ఆర్. కృష్ణ మోహన్, వాయల్పాడు సిఐ ప్రసాద్‌బాబు, ఎస్ఐలు చంద్రశేఖర్, శ్రీహరి పోలీస్ హెడ్ కానిస్టేబుళ్లు, దస్తగిరి, వేణుగోపాల్, కానిస్టేబుల్ అబ్దుల్లా, మోహన్ బాబు, ఎల్లయ్య పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలోనే పరిష్కారం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే సమస్యలను నిర్ణీత సమయంలోనే పరిష్కరించాలని అన్నమయ్య ఎఎస్‌పి ఎం వెంకటాద్రి అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యత ఇస్తూ సమగ్ర విచారణ జరిపి వెంటనే పరిష్కరించాలని అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ఫిర్యాదుదారులు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే సకాలంలో సత్వర న్యాయం చేస్తారని అన్నారు. ఫిర్యాదు దారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

'అన్నమాచార్య' అధ్యాపకురాలికి డాక్టరేట్



ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మిషన్‌లర్నింగ్ విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న స్వర్ణ సురేఖకు జెఎస్ యూనివర్సిటీ, షికోహాబాద్, ఫిరోజాబాద్, ఉత్తరప్రదేశ్ వారిచే పిహెచ్‌డి ప్రదానం చేశారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వి.నారాయణ సోమవారం తెలియజేశారు. 'ది ఫ్యూచర్ ఆఫ్ క్వాంటమ్ కంప్యూటింగ్ ఆపర్చునిటీస్ అండ్ ఛాలెంజస్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ వచ్చిందన్నారు. ఈమె విజయవాడకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ దుగ్గిరాల శరత్ బాబు ఆధ్వర్యంలో పిహెచ్‌డి చేశారన్నారు. ఆమె పరిశోధన వైద్య రంగంలో వ్యాధుల నిర్ధారణ వేగం, కచ్చితత్వం, నూతన ఔషధాలు, చికిత్సా పద్దతుల అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. ఆమెకు డాక్టరేట్ రావడం పట్ల కళాశాల చైర్మన్ ఎల్లారెడ్డి, రిజిస్ట్రార్ డా॥ ఎన్.మల్లిఖార్జునరావు, ఎఐఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ టి.హరికృష్ణలు స్వర్ణ సురేఖను అభినందించారు.

13న ఐటిఐలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

తంబళ్లపల్లి మండలంలోని టి.ఎన్.వెంకట సుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటిఐలో ఈనెల 13వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యా అభివృద్ధి సంస్థ అధికారి నాగార్జున తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎపిఎస్‌ఎస్‌డిసి సిడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్తంగా తంబళ్లపల్లెలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

151 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- జెసి ఆదేశాలతో వరుస దాడులు

ప్రజాశక్తి- కలకడ

జెసి ఆదర్శ రాజేంద్రన్ ఆదేశాల మేరకు మండలంలో రేషన్ బియ్యంపై వరుస దాడులు నిర్వహించినట్లు తహశీల్దారు ఫణి కుమార్ తెలిపారు. ఈ దాడులలో ఆదివారం 135 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్న విషయం పాఠకులకు తెలిసిందే. మండలంలో మరికొన్ని ప్రాంతాల్లో రేషన్ బియ్యం కోసం రెవెన్యూ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో బాలయ్యగారిపల్లి పంచాయతీకి చెందిన రేవూరి వెంకటరమణ సుమారు 145 క్వింటాళ్ల రేషన్ బియ్యంను రాజేశ్వరి సిమెంట్ బ్రిక్స్ తయారు చేసే గోడౌన్‌లో సీజ్ చేసినట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన రేవూరి వెంకటరమణ స్థానిక ఎర్రయ్యగారిపల్లిలో ఉన్న మన గ్రోమోర్ ఎరువుల అంగడి ప్రక్కన సుమారు 6 క్వింటాళ్ల బియ్యాన్ని దాచి ఉంచడం గమనించి వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. రేషన్ బియ్యం అక్రమంగా దాచి ఉంచిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సిఐ గురునాథ్, ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఈ దాడులలో డిఎస్ఒ రఘురాం, సిఎస్‌డిటిలు పజులుల్లా, విజయరెడ్డి, డిఎస్ఒ డిటి శివప్రసాద్, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



రేషన్ బియ్యాన్ని పట్టుకొని సీజ్ చేస్తున్న అధికారులు

మహిళ కడుపులో మూడున్నర కిలోల కణితి తొలగింపు

- అరుదైన శస్త్ర చికిత్స చేసి తొలగించిన ప్రభుత్వాస్పత్రి వైద్యులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్



కణితి చూపిస్తున్న వైద్యులు

మహిళ కడుపులో ఉన్న మూడున్నర కిలోల కణితిని రెండు గంటలు శ్రమించి తొలగించారు ప్రభుత్వాస్పత్రి వైద్యులు. వివరాలు.. లక్కిరెడ్డిపల్లి మండలానికి చెందిన రెడ్డమ్మ అనే మహిళ తీవ్ర కడుపునొప్పితో ఏడాది నుంచి బాధపడుతుంది. నొప్పి భరించలేక రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యులకు తన సమస్యను తెలిపింది. ఆమెను పరిశీలించిన వైద్యులు తన కడుపులో సుమారు మూడున్నర కిలోల కణితి ఉన్నట్లుగా గుర్తించారు. వెంటనే రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డేవిడ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యుల బృందం డాక్టర్ మహేశ్వర రాజు, అనస్తియా డాక్టర్ అనిల్ కుమార్‌రాజు, గైనకాలజిస్ట్ డాక్టర్ కోటేశ్వరి మహిళకు శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి కడుపులోంచి సుమారు మూడున్నర కిలోల కణితిని తొలగించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ పేదలకు అందుబాటులో ఉంటూ మరిన్ని వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. పేదలు ఎంతో నమ్మకంతో ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారని వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. అరుదైన శస్త్ర చికిత్స ప్రాణాలు కాపాడిన వైద్య బృందానికి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ సిబ్బంది, వార్డు సిబ్బంది పాల్గొన్నారు.


మాతాశిశు మరణాలను నివారించాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం : మాతాశిశు మరణాలను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కేర్ కంపానియన్ ప్రోగ్రాం జిల్లా అధికారిణి డాక్టర్ సంధ్య అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు, నర్సులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు, శిశు మరణాలను తగ్గించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వాసుపత్రుల్లో పరీక్షలు చేయించుకుంటున్న గర్భవతులకు కాన్పు అయిన వెంటనే శిశువుల సంరక్షణపై అవగాహక కల్పించాలని సూచించారు. గర్భవతుల్లో రక్తహీతన సమస్య లేకుండా చూసుకోవాలని, ఎక్కడ రక్తహీనతతో మరణాలు సంభవించకూడదని సూచించారు. గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, తద్వారా పుట్టబోయే బిడ్డ మంచి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం, డాక్టర్లు రవి కుమార్, జ్ఞానేశ్వర్, హర్షిత రెడ్డి, సోని, మమత, ఆసిఫ్, హిమబిందు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాతాశిశు మరణాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సంధ్య

మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే



సిసి రోడ్డు నిర్మాణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే షాజహాన్ బాషా స్పష్టం చేశారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 31వ వార్డులో రెండు మురుగునీటి కాలువలు, 33వ వార్డులో సిసి రోడ్డు నిర్మాణానికి చైర్‌పర్సన్ వి.మనూజ, కమిషనర్ కె.ప్రమీలతో కలిసి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం అవలంభించిన విధానాలతో మున్సిపాలిటీ అభివృద్ధి పూర్తిగా కుంటుబడిందన్నారు. మున్సిపాలిటీకి సంబంధించిన నిధులు పక్కదారి పట్టించడంతో ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పరిస్థితులను ఒక్కొక్కటిగా చక్కదిద్దుతున్నామన్నారు. ఇక మదనపల్లె మున్సిపాలిటీలోని 35వ వార్డులలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతమిస్తున్నామన్నారు. ఇందుకు తగినన్ని నిధులు కేటాయిస్తున్నామని స్పష్టం చేశారు. అనంతరం చైర్‌పర్సన్ వి.మనూజ మాట్లాడుతూ పార్టీలకతీతంగా మున్సిపాలిటీని అభివృద్ధి చేయడమే లక్ష్యమని, ఇందుకు ఎమ్మెల్యే సహాయ సహకారాలు తీసుకుంటామన్నారు. నిధులు మంజూరులో అన్ని వార్డులకు సమ ప్రాధాన్యత కల్పిస్తామని స్పష్టం చేశారు. అంతకుముందు ఎమ్మెల్యేకి 31వ వార్డు ఇన్‌ఛార్జ్ తమ్మిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో 31వ వార్డు కౌన్సిలర్ రజిని నరేంద్ర, టిడిపి నాయకులు తమ్మిశెట్టి రామకృష్ణ, మధుసూదన్‌రెడ్డి, ముసలికుంట నాగయ్య, బెల్లె రెడ్డి ప్రసాద్, బీదం గురునాథ్ యాదవ్, బొమ్మిశెట్టి పురుషోత్తం, రాటకొండ శ్రీనివాసులు నాయుడు, దుబ్బిగాళ్ల భాస్కర్, జయచంద్ర, ఎంఆర్‌పిఎస్ ఆరేటి వాసు, మంజునాథ్, నాగమణి పాల్గొన్నారు.



హెచ్ఎంకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న సుబ్బరాయుడు నాయుడు

జడ్‌పి హైస్కూల్‌కు క్రీడా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని టి.కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుడారు సీతమ్మ ట్రస్టు వ్యవస్థాపకులు గూడూరు సుబ్బరాయుడు నాయుడు సుమారు రూ.పదివేలు విలువ చేసే క్రీడా సామగ్రిని సోమవారం పాఠశాల హెచ్ఎం బబితకు అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల వైస్ ప్రెసిడెంట్ కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ టి.కమ్మపల్లి గ్రామ పెద్ద డాక్టర్ గుడారు సుబ్బారాయుడు నాయుడు తన తల్లి గుడారు సీతమ్మ పేరిట ట్రస్టును స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఈ పాఠశాల విద్యార్థుల కొరకు అనేకమార్లు నగదును మరి క్రీడా సామగ్రిని అందజేస్తూ వస్తూ ఉన్నారన్నారు.అంతేకాకుండా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతి ఏటా నగదు బహుమతులు అందజేస్తూ వస్తున్నారన్నారు. విద్యార్థులు ఈ క్రీడా సామగ్రిని సద్వినియోగం చేసుకొని క్రీడా పోటీల్లో పాల్గొని పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెంకటాద్రి నాయుడు, కె.వి.నారాయణ, సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు రమణారెడ్డి, సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, బాల నరసింహులు, గిరిధర్, షామీర్, ఆసిఫ్ భాష, ప్రమీల పాల్గొన్నారు.



సుందర్ కు ఆర్థిక సాయం చేస్తున్న హెల్పింగ్ మైండ్స్ బృందం

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

కష్టాల్లో ఉన్న నిరుపేద టి మాస్టర్ కుటుంబానికి హెల్పింగ్ మైండ్స్ బాసటగా నిలిచింది. తమ వంతుగా ఆర్థిక సాయం చేసి ఆదుకుంది. స్థానిక బెంగుళూరు బస్టాండులో 30 ఏళ్లుగా టి మాస్టారుగా పనిచేస్తున్న సుందర్ ఎంతో మందికి సుపరిచితుడు. సుందర్ భార్య సరస్వతి అనారోగ్యం బారిన పడడంతో పరీక్షలు చేయించగా గర్భ సంచి కేన్సర్‌గా గుర్తించారు. బాధితుడు హెల్పింగ్ మైండ్స్‌ను ఆశ్రయించగా వారు ఆపన్న హస్తం అందిస్తూ సోమవారం రూ.21 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్ధిక్ మాట్లాడుతూ టి మాస్టర్ తన భార్య అరోగ్యం కోసం సంప్రదించగా చిరు సహాయంగా రూ.21 వేలు ఆర్థిక సాయం చేశామన్నారు. పలువురు స్పందించి ఆ పేద టి మాస్టారుకు సాయం చేసి ఆదుకోవాలని కోరారు. భవిష్యత్తులో అతను స్వయంగా టి స్టాల్ పెట్టుకోవడానికి చేయూతనిస్తామన్నారు. గొప్ప మనసుతో తన కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్ సిద్ధిక్, సభ్యులు కిరణ్, ఫయాజ్, మన్సూర్‌లకు సుందర్ ధన్యవాదాలు తెలియజేశాడు.

ఫీజుల కోసం ఒత్తిడి తీసుకురావొద్దు

ప్రజాశక్తి-బి.కొత్తకోట: మండలంలోని ప్రయివేటు పాఠశాలల్లో ఫీజుల చెల్లింపు వ్యవహారంలో విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకురావొద్దని బాస్ నాయకులు అన్నారు. మండలంలోని ఎంఆర్‌సి భవనంలో సోమవారం ఎంఇఒ రెడ్డి శేఖర్‌కు ఆర్‌టిఇఎస్ఇ 2023-24, విద్యా సంవత్సరం ప్రయివేట్ స్కూళ్లలో విద్యార్థుల ఫీజు చెల్లింపులు విషయంపై బాస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాస్ నాయకులు మాట్లాడుతూ నిర్బంధ విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం 1వ తరగతిలో వెనుకబడిన వర్గాలు, బలహీన వర్గాల పిల్లల కోసం నోటిఫికేషన్ ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. మండలంలో ఎంపిక చేయబడిన విద్యార్థులను ప్రయివేట్ స్కూల్స్ యాజమాన్యం పిల్లల తల్లితండ్రులపై ఒత్తిడి తెచ్చి మీకు ఉచిత విద్యలేదని ఈ సంవత్సరం నుండి ఫీజులు కట్టాలని లేని పక్షంలో పిల్లలకు జరిగే పరీక్షలలో ఈ పిల్లలను రాయనీయకుండా అవమానిస్తున్నారన్నారు. ఎవరైనా విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజు కట్టలని ఒత్తిడి తెస్తే తన దృష్టికి తేవాలని ఎంఇఒ చెప్పారు. కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్ సేన మండల అధ్యక్షులు పలక వెంకటేష్, కొగర్ మాధవ, సచిన్ పాల్గొన్నారు.

శ్మశాన స్థలం ఆన్‌లైన్ తక్షణమే రద్దు చేయాలి

ప్రజాశకి-పుల్లంపేట : మండల కేంద్రంలోని పుల్లంపేట సచివాలయంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి ఇటీవల హిందూ శ్మశాన వాటిక ప్రహరీ కూల్చిన విషయంపై స్థానిక తహశీల్దార్ అరవింద్ కిషోర్, మండల నోడల్ అధికారి కృష్ణారావుకు అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సర్వేనెంబర్ 280-1లో అవ్వారు విజయబాబు పేరును ఆన్‌లైన్ నుంచి తొలగించాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుశీల్ కుమార్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 18 అర్జీలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి: మండలంలోని కొట్టాల రెవెన్యూ గ్రామ పంచాయతీలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. నోడల్ ఆఫీసర్ మధుసూదన్, తహశీల్దార్ హరి కుమార్ మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారానికి ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుండి రెవెన్యూ సమస్యలకు సంబంధించి 16 అర్జీలు, భూ సర్వే కోసం 2 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. సదస్సులు సబ్ రిజిస్టర్ ఉదయ్ కిరణ్ రెడ్డి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రామ్ రాజ్, రెవెన్యూ అధికారులు, దేవాదయ శాఖ కొండ కిట్ట పాల్గొన్నారు.

అర్జీదారులతో గౌరవ ప్రదంగా వ్యవహరించాలి : కలెక్టర్



అర్జీదారులతో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని, అర్జీదారుల పట్ల గౌరవ ప్రదంగా వ్యవహరించి వారి సమస్యలకు నాణ్యమైన పరిష్కార మార్గంచూపాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తారని చెప్పారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్ గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలని చెప్పారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదనరావు, ఎస్‌డిసి రామసుబ్బయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి : మంత్రి

ప్రజాశక్తి-చిన్నమండెం

ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసే పౌష్టికాహారాన్ని చిన్నారులకు సక్రమంగా అందించేందుకు అంగన్వాడీ టీచర్లు, వర్కర్లు చర్యలు తీసుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కేశపురం గొల్లపల్లి అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు మంత్రి స్వీట్స్ అందజేసి అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి పభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం ఇస్తోందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలలో పనిచేసే టీచర్లు, ఆయాలు చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం ఇవ్వాలన్నారు. అంగన్వాడీ సిబ్బంది సమయపాలన పాటించి విధులు నిర్వహించాలని వారికి సూచించారు.

అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు : అధికారులు ప్రజా దర్బార్ కార్యక్రమంలో వచ్చే అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బోరెడ్డిగారిపల్లెలో తమ నివాసంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ కూడా భూ సమస్యలు ఉండకూడదని భూ సమస్యల పరిష్కారానికి ప్రతి మండలంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అధికారులు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయకుండా బాధితుల సమస్యలను ఆకడికక్కడ పరిష్కరించాలన్నారు. రాబోయే రోజులలో భూ సమస్యల పరిష్కారానికి శాశ్వత పరిష్కారం చూపడం జరుగుతుందని ఈ విషయాన్ని అధికారులు దృష్టిలో ఉంచుకొని పని చేయాలన్నారు.

కేశాపురంలో నీటి సమస్య పరిష్కారం : నియోజకవర్గంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దేవళంపేట, కేశాపురంలో నూతనంగా వేసిన బోరుకు మోటార్ బిగించి గ్రామానికి నీటి సరఫరా చేశారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. ప్రతి గ్రామంలో నూతన బోరు వేసి మోటార్ బిగించి గ్రామాలకు నీటి సరఫరా చేయడం జరుగుతుందని రాబోయే ఐదు సంవత్సరాలలో ప్రతి గ్రామానికి నీటి సరఫరా చేసి శాశ్వత నీటిసమస్య పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే పలు గ్రామాలలో నూతన బోర్లు వేయడం జరిగిందని ప్రాధాన్యత క్రమంలో ప్రతి గ్రామానికి బోరు వేసి నీరు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముందు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కేశాపురంలోని పాలేటమ్మ అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామానికి నీరు వదలడం జరిగింది. కేసాపురం గ్రామ ప్రజలు హర్షణ వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి బాధ్యతగా పనిచేస్తున్నాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నియోజకవర్గం అభివృద్ధికి బాధ్యతగా పనిచేస్తున్నామని, అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే షాజహాన్ బాషా స్పష్టం చేశారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని మూడు మండలాల కూటమి నాయకులతో అభివృద్ధి, సభ్యత్వాల నమోదుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం పనిచేస్తుంటే అధిష్టానం వద్ద తప్పుడు ఫిర్యాదులు చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అవినీతికి ఎక్కడా అస్కారం ఇవ్వకుండా పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారని, ఆయనను అనుసరించి తాను నియోజకవర్గంలోని మూడు మండలాల అధికారులకు అవినీతి లేకుండా ప్రజలకు సేవలు అందించాలని కోరడం జరిగిందన్నారు. అయితే అవినీతికి అలవాటు పడిన కొంతమంది అధికారులు అదే తీరును కొనసాగిస్తూ వస్తున్నారన్నారు. మదనపల్లి తహశీల్దార్ రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలను తీవ్రంగా వేధిస్తున్నారని, ఇది తన దృష్టికి రావడంతో కలెక్టరుకు ఫిర్యాదు చేశామన్నారు. అవినీతి అధికారులకి నియోజకవర్గంలో చోటు లేదన్నారు. మదనపల్లెలో రోడ్ల విస్తరణ కొరకు ఉపాధి హామీ కింద కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేస్తున్నామని స్పష్టం చేస్తున్నారన్నారు. అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు అందజేస్తామని తెలిపారు. టిడిపి సభ్యత్వ నమోదు మరింత వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ 15 ఏళ్ల తర్వాత మదనపల్లిలో టిడిపి విజయం సాధించిందంటే అది కేవలం షాజహాన్ బాషా నాయకత్వ ప్రతిభే అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడే స్వయంగా షాజహాన్ బాషా అయితేనే మదనపల్లిలో టిడిపి విజయం సాధిస్తుందని నమ్మి కేటాయించడం ఆయన సమర్థతకు నిదర్శనమన్నారు. కూటమి నాయకులంతా ఎమ్మెల్యే పనితీరును ప్రశ్నిస్తున్నారని కొనియాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాజ్ బాషా

ఎవరెన్ని విమర్శలు చేసినా ఎమ్మెల్యే షాజహాన్ బాషాతో కలిసి నియోజకవర్గం అభివృద్ధికి బాటలు వేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాదెళ్ల విద్యాసాగర్, ఆర్.జె.వెంకటేష్, నంద, శ్రీరామ రామాంజనేయులు, దారం అనిత, ఎస్.ఏ.మస్తాన్,నాగూర్ వలి, ముసలికుంట నాగయ్య, కలకడ వేణుగోపాల్, చల్లా నరసింహులు, రెడ్డి రాంప్రసాద్, ఓసూరి కిరణ్ కుమార్, బాలు స్వామి, రాటకొండ మధుబాబు, బొమ్మిశెట్టి పురుషోత్తం, యర్రబల్లి వెంకటరమణారెడ్డి, రాటకొండ శ్రీనివాసులు నాయుడు, తమ్మిశెట్టి రామకృష్ణ, రామిశెట్టి నీలకంఠ, కమలామర్రి కృష్ణ, ఎస్.ఎం.రఫీ బైగారి రాజానాయుడు, పెంచుపాడు స్వామి, జెసిబి మధుసూదన్ రెడ్డి, జెసిబి వేణు, బీదం గురునాథ్ యాదవ్, బాలమాలి శేఖర్, జీవి నాయుడు, రెడ్డి రాయల్స్, మంజునాథ్, మాజీ కౌన్సిలర్లు రాధమ్మ, పులి మహాలక్ష్మి, బైగారి భారతి నాయుడు, నాగమణి, శ్యామలమ్మ, మూడు మండలాల కూటమి నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్యంపై దృష్టి సారించాలి



గర్భిణులకు పండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ రమేష్‌రెడ్డి



గర్భిణులకు పండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్లు కమల్, విశ్వనాథ్

ప్రజాశక్తి-పీలేరు

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం ద్వారా తల్లీ, బిడ్డను సురక్షితంగా ఉంచవచ్చని డాక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు. పిఎంఎస్ఎంఎ కార్యక్రమంలో భాగంగా సోమవారం తలుపుల పిహెచ్‌సిలో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు, చికిత్స అందించారు. గర్భిణీ కాలంలో కనీసం నాలుగు సార్లైన వైద్యుల చేత ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. తద్వారా పిండం లోని శారీరక లోపాలు, పిండం ఎదుగుగల, తల్లిలో రక్తహీనత, అధిక రక్తపోటు, మధుమేహం, గుర్రపు వాతం వంటి క్లిష్ట సమస్యలు తెలుసు కుని, తగు నివారణా చర్యలు తీసుకుని సురక్షిత మాతృత్వం పొందవచ్చున్నారు. స్థానిక పిహెచ్‌సిలో విధులు నిర్వ హిస్తున్న రెడ్డిబీ సహాయ సహకా రాలతో 32 మంది గర్భిణులకు పండ్లు, పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు కుసుమ, కృష్ణయ్య, ఎఎన్ఎంలు నాగవేణి, రెడ్డిబీ, సిహెచ్ఒ లావణ్య, ల్యాబ్ టెక్నిషియన్ కుమార్, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

36 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు

నందలూరు: ప్రధానమంత్రి సురక్షిత అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 36 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ శరత్ కమల్, డాక్టర్ విశ్వనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులకు బిపి, రక్త పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. 29 మంది గర్భిణులను గైనకాలజిస్ట్ డాక్టర్ మస్తానమ్మ స్కానింగ్ నిర్వహించి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ సందర్భంగా రాయల్ సేవా సమితి సభ్యులు భరత్,నరేష్, పెంచలయ్య రాము, గంధం గంగాధర్, నరేష్, పెంచలయ్య ఆధ్వర్యంలో గర్భిణులకు, ఆశ కార్యకర్తలకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సిహెచ్ఒ వెంకటనారాయణ, సూపర్వైజర్ సునీల్ కుమార్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **కలకడ:** గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కలకడ, ఎర్రకోటపల్లి వైద్యాధికారులు మల్లికార్జున, కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కలకడ ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులకు పరీక్షలు నిర్వహించే వారికి ఉచితంగా ఐరన్ మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కలకడ వైద్యశాల నుండి 29 మంది ఎర్రకోటపల్లి వైద్యశాల నందు 35 మంది గర్భవేతులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులకు ప్రతినెల స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి వైద్య సేవలు పొందాలని సూచించినట్లు తెలిపారు. గర్భిణులు ఆకుకూరలు, కోడిగుడ్లు, పాలు వంటి ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యకరంగా ఉంటాడని సూచించారు. ప్రభుత్వ వైద్యశాలలో కాన్పుల వల్ల తల్లి బిడ్డ క్షేమంగా ఉంటారని, ఈ విషయాన్ని గమనించి ప్రభుత్వ వైద్యశాలలనే ఆశ్రయించాలని వారు సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మోహన్, జవహర్ బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ రాజమ్మ, హెల్త్ సూపర్వైజర్లు రామకృష్ణమ్మ, వెంకటేశ్వరరావు ల్యాబ్ టెక్నీషియన్ హాజీరబీ, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.



సిమెంట్ రోడ్డుకు భూమిపూజ నిర్వహిస్తున్న రూపానందరెడ్డి

రూ.30 లక్షలతో సిసి రోడ్డుకు భూమిపూజ

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని వై.కోట పంచాయతీ రాములమ్మ కాలువ గ్రామంలో రూ.30 లక్షల వ్యయంతో సోమవారం అడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సిమెంట్ రోడ్డుకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూపానందరెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతి వీధికి సిమెంట్ రోడ్డు రూపకల్పనే లక్ష్యంగా గ్రామ సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రతి మారుమూల పల్లెకు నూతన వైభవం తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. ఏ గ్రామంలో అయినా రోడ్డు విద్యుత్ తాగునీరు వంటి సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకుని వస్తే తక్షణమే పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విఆర్‌ఒల మండల కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-కలికిరి



సురేష్‌రెడ్డి



ప్రసాద్‌రెడ్డి

మండలంలో గ్రామ రెవెన్యూ అధికారుల నూతన కార్యవర్గాన్ని సోమవారం కలికిరిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా ఎన్.సురేష్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా టి.ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శిగా బి.నరేష్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా టి.శిల్ప కుమారి, కోశాధికారిగా బి.గౌరీ, ఉప కోశాధికారిగా జె.శ్రీనివాసులును ఎన్నుకున్నారు. మండలంలోని విఆర్‌ఒల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది. ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకోవడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించండి

ప్రజాశక్తి - రామసముద్రం

మండల కేంద్రంలో వడ్డెర ఓబన్న విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని వడ్డెర సంఘం మండల అధ్యక్షులు రెడ్డెప్ప ఆధ్వర్యంలో వడ్డెర సంఘం నాయకులు తహశీల్దార్ నిర్మాలదేవి, ఎంపిడిఒ బాను ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం నాయకులు మాట్లాడుతూ మండలంలో అధిక సంఖ్యలో వడ్డెర కులస్తులు నివసిస్తున్నారని తమ కులస్తులు అభిప్రాయం మేరకు మండల ఉన్నతాధికారులు స్పందించి ఒడ్డెర ఓబన్న విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ఉన్నతాధికారులకు విన్నవించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వడ్డెర కమిటీ జిల్లా నాయకులు వాలెప్ప, గౌరవ అధ్యక్షులు చిన్నవెంకటప్ప, పాలకోట గంగప్ప, పూజారి సుబ్రమణ్యం, వెంకటరమణ, మంజు, వెంకటరమణ, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మొక్కలే జీవకోటికి ప్రాణాధారం

ప్రజాశక్తి-కలకడ

మొక్కలే జీవకోటి ప్రాణాధారమని ఆదర్శ పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్ కోట రమేష్ నాయుడు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన కలకడలోనే ఆదర్శ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. చెట్ల వలన ఉపయోగాలు చాలా ఉన్నాయని వాటిని పెంచుకోవడం వలన జీవరాశులకు జీవనాధారమని తెలిపారు. చెట్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వైస్ ప్రిన్సిపల్ చంద్రశేఖర పేర్కొన్నారు. పచ్చని చెట్లతో ప్రగతి పథంలో పయనించేందుకు ఎంతో ఉపయోగంగా ఉంటాయని పేర్కొన్నారు. పాఠశాలకు ముందు భాగంలో పండ్ల మొక్కలు, అందమైన మొక్కలను నాటారు. చెట్ల వలన వచ్చే ఆక్సిజన్‌తో జీవరాశుల మనకు కూడా సాగిస్తున్నాయని తెలిపారు.చెట్లే లేకపోతే జీవకోటి మనుగడ నశించడం ఖాయమని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించిన ఇఒ

ప్రజాశక్తి-కలికిరి

15వ ఆర్థిక సంఘం నిధులతో మేజర్ పంచాయతీ పరిధిలో ఇఒ అశోక్, సర్పంచ్ ఎల్లయ్య నూతన బోరు వేసి సమస్యను పరిష్కరించారు. సోమవారం విజిబుల్ అసెట్స్ కింద స్కీం బోరు వేసిన కలికిరి పంచాయతీ అధికారులు మండలంలోని కలికిరి మేజర్ పంచాయతీ పరిధిలో త్రాగునీటి పరిష్కారం కొరకు విజిబుల్ అసెట్స్ క్రింద 15వ ఆర్థిక సంఘం నిధులతో స్కీం బోరును వేస్తున్నట్లు ఇఒ అశోక్, టిడిపి యువ నాయకులు రెడ్డివారి యోగేష్‌రెడ్డి తెలిపారు. కలికిరి పట్టణంలోని పోలీస్ లైన్, ఎస్బీఐ లైన్ ప్రజలకు తాగునీటి సమస్య ఉందని వార్డు సభ్యులు అల్లాబక్ష్ ఇఒ అశోక్, రెడ్డి వారి యోగేష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఇఒ అశోక్, రెడ్డి వారియోగేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపిడిఒ భానుమూర్తి రావు, ఇఒపిఆర్‌డి మహమ్మద్ రియాజుద్దీన్ చేతులు మీదుగా పోలీస్ లైన్ వెనుక వీధిలో బోరు పాయింట్‌కు టెంకాయ కొట్టి సోమవారం పూజలు నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ యల్లయ్య, టిడిపి నాయకులు ఉత్తన్న, రెడ్డప్ప రెడ్డి, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి-గుర్రంకొండ/మదనపల్లె అర్బన్

కరెంటు షాక్‌తో ఓ యువకుడు దుర్మరణం పాలైన సంఘటన సోమవారం కురబలకోట మండలంలో జరిగింది. మృతిని కుటుంబ సభ్యులు, తోటి పనివారు తెలిపిన వివరాల మేరకు.. గుర్రంకొండ మండలం మర్రి పాడుకు చెందిన సాదిక్ అలీ(30) తరిగొండలో నివాసం ఉంటూ అక్కడే ఓ వెల్డింగ్ షాపును ఏర్పాటు చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో కురబలకోట మండలం ఎర్రమద్దివారిపల్లికి చెందిన రమణమ్మకు రేకుల షెడ్డు అమర్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. తన పనివారు ముఖద్దర్, అమీనుల్లా, ఇబ్రహీంలతో కలిసి సాధిక్ ఆలీ ఎరమద్దివారిపల్లెకు వెళ్లాడు. అక్కడ రేకుల షెడ్డు నిర్మాణం చేస్తుండగా పైన వెళ్తున్న 11 కెవి వైర్లకు పైపులు తగిలి కరెంటు షాక్‌కు గురయ్యాడు. ఈ ప్రమాదంలో సాధికాలీ తీవ్రంగా గాయపడగా, మిగతా ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే బాధితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సాధిక్ ఆలీ మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు తెలిపారు. మిగతా ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృతుడికి భార్య ఆయేషా ఉంది. కుటుంబానికి ఆసరాగా ఉన్న సాధిక్ ఆలీ మృతి చెందడంతో ఆ కుటుంబం వీధిన పడింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రికి చేరుకుని బోరున విలిపించారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన సాదిక్ ఆలీ

కోడి పందెం రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-కలకడ

కోడిపందెం ఆడుతున్న కోడిపందెం రాయుళ్లను అరెస్టు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ హరిబాబు తెలిపారు. మండలంలోని దిగువ తాండ పంచాయతీ దిగువ తాండాకు సమీపంలో కోడి పందెం ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి కోడి పందెం ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను చుట్టుముట్టి పట్టుకుని వారి వద్ద నుండి రూ.3300 నగదును, ఆరు ద్విచక్ర వాహనాలు, 6 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి, వారిని అరెస్టు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. ఈ దాడులలో పోలీస్ సిబ్బంది లక్ష్మినారాయణ, రమణ నాయక్, నాగిరెడ్డి పాల్గొన్నారు.